# మాడు

వివిబి. రామారావు



అర్ధరాత్రి రూమ్‌కి తెచ్చిచ్చాడు టెలిగ్రాం వాచ్‌మెన్. కళ్లు నులుపుకుంటూ ట్రిపుల్ ఎక్స్‌చూసి వెంటనే డీకోడ్ చేసుకున్నాను. మామూలు బట్టలతో తెల్లవారుఝామున నాలుగుగంటలకి కలెక్టర్ ఆఫీస్ వెనకరోడ్డుమీద కలుసుకోమని కమీషనర్ ఆదేశం హైదరాబాదు నుంచి.

మంచంమీద అటూ ఇటూ దొర్లాను, ఇంక నిద్రరాక. మళ్ళీ స్నానం చెయ్యడానికి అవకాశం దొరక్కపోవచ్చు. ఇలాంటి ఆదేశాలు నే పనిచేస్తున్నడిపార్టుమెంటులోని ఉద్యోగులకు కొత్తకాదు. ఆదేశం రాగానే వెళ్లాలి. తిరిగి వచ్చే అవకాశాలు ఫిఫ్టీ, ఫిఫ్టీ. పెళ్లయినవాళ్ల కయితే భార్య మాంగల్యబలం; పెళ్లికాని నాలాంటి వాళ్లకయితే తల్లి కడుపు చలవ.

స్టౌమీద నీళ్లు పడేసుకున్నాను.

కమీషనర్ అంటే నాకు చాలా గౌరవం. ప్రమాదకరమైన పరిస్థితుల్లో మమ్మల్ని వెనక్కునెట్టి ఆయన ముందు కురుకుతాడు. తన హోదా అనే కోటుతో మా ముందు బిగిసిపోయి మమ్మల్ని హడలుకొట్టేయకుండా చనువుగా మాట్లాడినా చండశాసనుడనే పేరూ ఉంది ఓ ప్రక్క.

ముఖం కడుక్కుని షేవ్ చేసుకోడానికి ఉపక్రమించాను. రాజీతో చెప్పి వెళితే బావుండును. కాని ఎలా, నైట్ వాచ్‌మన్ టెలిగ్రాం ఇచ్చేసి వెంటనే వెళ్లిపోయాడు ఆఫీసుదగ్గర ఎవరూలేరని.

గడ్డం కసుక్కున తెగిపోయింది.

ఏదో కీడు శంకిస్తూనే లోషన్ కాస్త రాసేసుకుని అప్పటికి పూర్తి కానిచ్చేశాను.

సంకేత స్థలానికి నాలుగవకుండానే చేరాను. అప్పటికే కమీషనర్, ఒకే ఒక్క గార్డూ అక్కడున్నారు.

"మిస్టర్ భాస్కర్, ఇంకో నలుగురిని పిలిచాను. నువ్వు ముందువెళ్ళి ఓ టాక్సీ కుదిర్చి తీసుకురా. నలభైమైళ్ళకి సరిపోగా పెట్రోలు పోయించుకుని వచ్చెసెయ్."

"సర్!..."

"ఏమిటి నీ సందేహం?"

"ఇక్కడ మీరొక్కరూ..."

"దట్సాల్ రైట్. నువ్వెళ్లు. స్టేషన్ జంక్షన్ దగ్గర రిక్షా దొరుకుతుంది. కమ్ బ్యాక్ క్విక్!"

పెట్రోల్ వేయించుకుని టాక్సీ స్టేషన్‌వద్దకు వెళ్లేసరికి కమీషనర్, ఇతర ఉద్యోగులూ రడీగా ఉన్నారు.

టాక్సీలో కూచున్నాక కమీషనర్ డ్రైవర్‌తో చెప్పారు శ్రీకాకుళం పోనియ్యమని.

సంజీవరావ్‌కి గుండెదడదడలాడింది. ఇన్‌స్పెక్టర్‌గా తానిచ్చిన ఆచూకీమీద ఈ మెరుపుదాడి జరుగుతోంది.

నాతో మెల్లగా చెప్పడం ప్రారంభించాడు సంజీవరావ్.

"ఐ. టెన్(ఐ, అంటే ఇన్‌ఫార్మర్-ఆచూకీ ఇచ్చేవాడు-వాళ్లందరికీ నంబర్లుంటాయ్) ఎప్పుడూ తప్పుచెయ్యడు. ఓ మూడురోజుల క్రిందట అర్జంటుగా వచ్చాడు ఆఫీస్‌కి. వాడి 'చిలక'ను పురిటికి ఆస్పత్రిలో చేర్పించాడట. డాక్టర్‌కు రెండొందలు ఇస్తేకాని పని జరగదని ఎవరో చెప్పారట. నేను డాక్టర్‌కు ఫోన్ చేసి చెబుతానన్నాను. ముష్టి రెండొందలకు మొహం చూసుకున్నానని నా మొహంమీదే అనేశాడు. నాకు కష్టమనిపించింది. అతనిద్వారా ఇంతకుముందు రెండు 'ఆపరేషన్ల'లో టెన్.ఎమ్. (పది కేజీలు) సిక్స్‌టీన్ ఎమ్ (16 కేజీలు) దొరికింది. అప్పటికి మీరింకా ఈ సర్కిల్‌లోకి రాలేదనుకుంటా...వాడితో మెల్లగా నచ్చచెప్పడానికి ప్రయత్నించాను.

"చూడు, నర్సయ్యా రెండొందలంటే కష్టం..."

"మీ దయ బాబూ, నాయంగా బతికేఓడికి ఈ రోజుల్లో కూడెక్కడ?"—గిరుక్కున తిరిగి వెళ్ళిపోయాడు.


"మరి ఇప్పుడీ లైన్ ఎవరిచ్చారూ?" కమీషనర్ వెనక్కు తిరిగి అడిగారు.

—టాక్సీల్లో వాళ్లమంతా తెల్లబోయాం.

"సారీ సర్, సెక్యూరిటీ..."

"డోన్ట్‌వరీ, అసలేం జరిగింది?"

"దాని పుస్తెలుతీసి ఇచ్చిందట, నర్సయ్య అవి పట్టుకెళ్లి మార్వాడీకి చూపాడట. తను బాగా బతికినరోజుల్లో




రెండు 'శతమానాలూ' సుమారు తుల మెత్తు చేయించాడట. సేట్ దౌలత్‌రామ్ ఫూల్‌చంద్ సోగానీ నూటయాభై కంటే ఇవ్వనన్నాడట. తాకట్టుపెడితే కావలసిన డబ్బు రావడంలేదు, అమ్మడానికి ఇష్టం లేదు. ఆలోచించి ఆలోచించి విసిగిపోయాడు. విచారంగా టీ బడ్డీదగ్గర కూచుని టీ తాగుతూంటే అక్కడ తెలిసిందట, తోలుపెట్టె ఆసామీ టాక్సీలో సేట్ ఇంటికి వచ్చాడని. ఆ ఆచూకీ పట్టుకుని నావద్దకు వచ్చాడు.

"బాబూ, తమరు రెండొందలు నాకియ్యక తప్పదు. ఆపరేషన్ అయినాక తమకు తోచింది ఇస్తురుగాని. కాకపోతే నేనాగోనాగ తీరుసుకుంటా!"

"నాకు ఇవ్వక తప్పలేదు. నాకు అదర్‌సోర్సెస్‌ద్వారా తెలిసింది తోలుపెట్టె రహస్యం. అందుకనే మీకు వెంటనే తెలియపరిచాను."

"బొంబేనుంచి నాకూ ఇన్‌ఫర్మేషన్ వచ్చింది..."

ఆయనవైపు ఆశ్చర్యంగా చూశాను. పక్కనే డ్రైవర్. ఇంత బహిరంగంగా మాటాడేస్తున్నారు.

పొందూర్ జంక్షన్‌రానిచ్చి డ్రైవర్ వైపు తిరిగి చెప్పారు.

"చూడబ్బాయ్! మేమంతా ఇక్కడ దిగిపోతాం. ఇతన్ని పొందూరు తీసుకెళ్లు. అక్కడ పని అయ్యాక అతను చెప్పినచోటుకి తీసుకెళ్లు."

హఠాత్తుగా దిగిపోయాం కారు.

తెలతెలవారుతోంది. రోడ్డుపక్క పాకలో తొందరపెట్టి టీ చేయించుకు తాగాం. టీ తాగిన తరువాత మమ్మల్ని ఓ చెట్టుకిందకు తీసుకెళ్లి చుట్టూఒకసారి చూసి చెప్పారు కమీషనర్‌గారు.

"కొలీగ్స్, నేను ఆ గార్డ్‌కి అవసరమైన ఇన్‌స్ట్రక్షన్స్‌అన్నీ ఇచ్చి పంపా.

ఇప్పుడు మనం వెళ్లబోతున్నది శ్రీకాకుళం. ఐ.టెన్. ఆచూకీ ఇచ్చారని సంజీవరావ్ చెప్పిన కేస్. అన్నిఏర్పాట్లూ జరిగాయి. బీ బ్రేవ్, మైడియర్ ఫ్రెండ్స్! ఇవాళతో మరో దగుల్బాజీ ఆట కట్టిం చేద్దాం."

"కాని ఇప్పుడు మనం అక్కడికి చేరడం ఎలా?"

నా తరవాత చేరిన సన్యాసినాయుడు అడిగేశాడు.

"వైజాగ్‌నుంచి బయలుదేరిన పార్టీ మరో ఐదునిమిషాల్లో వచ్చేస్తుంది'' కమీషనర్‌గారు విసుక్కుంటా రనుకున్నాను. చిరునవ్వుతో సమాధానం చెప్పారు.

"స్ట్రైటజీ ...సర్ ..." నసిగాడు సంజీవరావ్.

"ఫ్రంటల్ ఎటాక్! తిన్నగా వ్యాన్ సేట్ ఇంటిదగ్గర ఆపి తలుపుకొట్టడమే! కొంచెం ముందుజాగ్రత్తగా ఇద్దరు ముందుగా వెనక వీధి తలుపుదగ్గర కాపు ఉండడం."

చిన్న తుంపర ప్రారంభమైంది.

మళ్ళీ పాకలోకి వెళ్లాం. అరగంటకి కాని రాలేదు వ్యాన్.

వ్యాన్ రాగానే వైజాగ్ ఇన్‌స్పెక్టర్ క్షమాపణ చెప్పుకున్నాడు.

"సారీసర్, వ్యాన్ టైర్ తోవలో మార్చుకోవలసి వచ్చింది."

మరో ఇరవై నిముషాల్లో ఊర్లో సెంటర్‌లోని హోటల్‌ముందు ఆగాం. తుంపర చిన్న జల్లుగా మారింది.

"నేనూ, భాస్కర్ వెరటిదోవ దగ్గర ఉంటాం. మీరు కాఫీ ఫలహారం తీసుకుని వ్యాన్‌లో సేట్ ఇంటికి వెళ్లండి.''


కమీషనర్‌గారు నాపక్కన నడుస్తుం డగా ఇద్దరం సేట్ ఇంటిముందు నుంచే వెళ్ళి చుట్టూ తిరిగి ఇంటి వెనకకు వెళ్లాం.

"సేట్ డాబామీద ఎవరో నుంచు న్నట్టుంది సార్. దూరంనుంచే చూశా..."

"అదే ఆలోచిస్తున్నా. మనం వస్తు న్నట్టు వాళ్లకు తెలిసిపోయి ఉంటే మన శ్రమా, ప్రభుత్వం డబ్బూ వృధా. లెట్ అజ్ హోప్ ఫర్ ది బెస్ట్.''

ఓ అరుగుమీద నుంచున్నాం. నిదానంగా సేట్ ఇంటివైపు చూస్తున్నారు కమీషనర్. సేట్ ఇంట్లో ఏమాత్రం బంగారం దొరుకుతుందా అని ఆలోచిస్తున్నాను నేను.

ఈక్షణంవరకూ కొన్ని లక్షలకు అధిపతి సేట్. మరి కాసేపట్లో నాశన మౌతాడు. నేరం చేసినవాడికి శిక్ష ఉచితమే అయినా కొన్ని పరిస్థితులలో నేరస్థుడిని చూస్తే జాలివేస్తుంది. ఇంతకు ముందు నే చూసిన ఓ 'ఆపరేషన్' లో ఓ వ్యాపారస్థుడు గుండెబాదుకుని ఘోర



మని ఏడ్చేవాడు  డబ్బు ఆర్జించినకొద్దీ ఆర్జించాలనే ఉంటుంది. బంగారం తినం కాని చిన్నపిల్లాడు ఇంకొంచెం, ఇంకొంచెం అని ఆశగా మైసూరుపాక్ అడిగి పోగుచేసినట్టు, సేట్ జీ బంగారం కూడపెట్టాడు. దొంగవ్యాపారం చేస్తున్నాడు. బంగారంకోసం ఎంత అన్యాయాలకైనా ఒడిగట్టి మానవత్వం మరిచిపోయి మనిషి ఉన్మాది ఔతాడు.— 'కాంతా, కనకం'—అన్నారు. కాంత మీద మోహంకంటె కనకంమీదమోహం మనిషిని ఇంకా దానవుడినిగా చేస్తుంది. నర్సయ్య పట్టుకెళ్ళిన బంగారానికి నూట యాభై ఎలా ఇస్తానన్నాడూ ఈ సేట్ దానవత్వం కాకపోతే?

అవతల వీధిలో వ్యాన్ హారన్ మోగింది. నా రివరీలోంచి మేల్కొన్నాను. లోపలకువెళ్ళి సోదాలో పాల్గొందామని ఆతృతగా ఉంది. కోట్లమందిని కొల్లగొట్టే కొద్దిమంది కిరాతకులను వేటాడంలో ఎంత ఉత్సాహముందో, వేటాడబడుతున్నప్పుడు వాళ్ళముఖాలు చూడదమన్నా అంత ఉత్సాహమే నాకు.

ఐదు నిముషాలయింది. ఎక్కడా

శబ్దం వినపడలేదు. తుంపర మాత్రం మనుషుల ఆవేశాలతో పనిలేనట్టు అదే వేగంతో పడుతోంది.

మేము హౌందూర్ పంపిన టాక్సీ తంచనుగా మాముందు ఆగింది. గార్డుతో పాటు అందులో మరో నలుగురు మనుషులున్నారు.

ఇదంతా కమీషనర్ గారి వ్యూహ రచనని తరవాత తెలిసింది. ఈ డిపార్టుమెంట్ లో ఎంత మెలకువగా ఉన్నా ఇంకా చాలదేమోనన్న సత్యం ఈ 'మాటు' తరవాత నే నెప్పుడూ మరచిపోలేదు.

కమీషనర్ గారు నా భుజంమీద తట్టి వానలోకి నడిచారు.

చుట్టూ తిరిగి వీధి ద్వారంలోంచి ఇంటిలోకి నడిచాం. హాల్లో కుర్చీలో కూర్చున్న సేట్ జీ, అతని పెద్దకొడుకు మమ్మల్ని చూసి నుంచున్నారు.

"ఆయీయే సాబ్, ఆయీయే!" సేట్ మర్యాద చేశాడు. "ఆప్ కా ఇన్ స్పెక్టర్స్ తలాష్ చేయించుతామన్నారు. ఠీక్ అన్నాను."

సేట్ ముఖంలో ఏమాత్రం కంగారు లేదు. కమీషనర్ గారి ముఖం వివర్ణమౌతుందనుకుని ఆయనవంక చూసిన నేను తెల్లబోయాను.

"షల్ ఐ గో ఇన్ సర్?"

"'నో నీడ్, సిట్ డౌన్!" ఆయన కంఠంలో నిరాశ ధ్వనించింది.

"థోడా నాస్తా ఖాయీయే సాబ్!' అంటూ సేట్ లోపల కెళ్ళాడు.

"ఎ వేస్ట్ ఆఫ్ అవర్ టైమ్..."

"కాని ఇతనికెలా...",

నా ప్రశ్న పూర్తికాకుండా "వియ్ విల్ టాక్ లేటర్" అనేశారాయన. కొద్ది క్షణాల్లో ఫలహారాలు తెచ్చి ముందుంచాడు సేట్. నేను కమీషనర్ గారి వంక చూశాను.

"టేక్ ఇట్" అన్నారు.

నేను తింటుండగా ఒక్కొక్కరే బయటకు వచ్చారు సేట్ అతిథిసత్కారాలు పూర్తిఅయ్యాయి.

బయట తుంపర కొద్దిగా తగ్గింది.

"రామ్ రామ్ సేట్ జీ" అంటూ కమీషనర్ గారూ, ఆయన వెనక మేమూ వీధిలోకి వచ్చి వ్యాన్ ఎక్కాం.

"సారీ, కొలీగ్స్ మనం రెయిడ్ చెయ్యబోతున్నామని ఈ సేట్ కి తెలిసిపోయింది." భాస్కర్ టాక్సీ తెచ్చినప్పుడు ఈ సమాచారం లీక్ అయి ఉంటుంది."

నా ముఖం ఎర్రబడింది.

"నలభై మైళ్లకు సరిపడా పెట్రోల్ పోయించమని దబ్బిచ్చాను. అంతే!"

"ఎక్కడ చెప్పావ్, ఆ మాట?"

"టాక్సీ ఎక్కిన తరువాత."

"అయితే బంక్ లో ముందు తెలిసిపోయిందన్నమాట..."

నావల్ల మాత్రమంతా వృధాఅయిందా

అని బాధపడుతూ అన్నాను: "సారీ సర్! మీరు వెళ్లండి. నేనూ, ఈయనా కాసేపు ఈ ఊళ్లో ఉంటాం." సంజీవరావ్‌ను చూపించాను.

"ఓ. కే."

వ్యాన్ వెళ్ళిపోయింది. టాక్సీని పంపించెయ్యడానికి మళ్ళీ వెనకవీథిలోకి వెళ్లాం.

"బాస్టర్డ్! మనఆచూకీ ఎలా తెలుసుకున్నాడో, ధీమాగా కాఫీ, ఫలహారాలు ఏర్పాటుచేశాడు." సంజీవరావ్ మొదలెట్టాడు. "నర్సయ్య ఇచ్చిన ఆచూకీ తప్పవదనుకొన్నాను. నర్సయ్య ఆచూకీ తప్పయి ఉండదు. అసలు సేట్ ఇంట్లో బంగారం కనపడకపోవడం ఆశ్చర్యం. బంగారం అంతా ఎక్కడికో తరలించి ఉంటాడు."

నా అసమర్థతకి నన్ను నేను తిట్టుకున్నాను.

టాక్సీ పంపించేశాను.

మేము నిలబడ్డ అరుగు ఇంటి తలుపు తెరుచుకుంది. లోపలనుండి ఒక స్టూడెంటులా కనపడే కుర్రాడు వచ్చాడు అరుగుమీద నుండే "ఎక్సైజ్ డిపార్ట్‌మెంటా సార్!" అన్నాడు.

అతనిదగ్గర దాచడం అనవసరం అని అవునన్నాను.

"ఐదింటికి గోనెమూట మీ ఎడంచేతి పక్క నాలుగో ఇంటిలోకి వెళ్ళింది. ఈ మాట చెప్పి లోపలికెళ్ళి తలుపేసుకున్నాడు.

నేనూ సంజీవరావ్ ఒకరి ముఖాలొకరు చూసుకున్నాం.

నాలుగో ఇల్లు దాటా.

"రావ్‌గారూ, లెట్ అజ్ ట్రై."

తలుపు తట్టాను నేను. 'యూ ఆర్ రైట్' రోడ్డుమీద నుంచున్న సంజీవరావ్ మాట వినపడింది.

తలుపు తెరుచుకున్నదే తడవుగా లోపలకెళ్ళాను.

"మీ ఇల్లు సోదా చెయ్యాలి."

ఈలోగా సంజీపరావ్ మెట్లెక్కేశాడు

"బంగారంసంచి ఎక్కడ?" గద్దిస్తున్నాడు సంజీవరావ్.

నాకంటపడినది ఇది...ఆ మార్వాడీ కుర్రాడి చేతిలో తలకిందులుగాఉన్న దినపత్రిక.

"ఏంచేస్తున్నావ్, నువ్విక్కడ?" గర్జించాను.

"పే...పేప...పేపరు"

చుట్టూ కలియచూశాం. "అదిగో ఆ సంచి ఏమిటి?"

అటువేపుచూసి జేబులోవి తాల తీసి గట్టిగా ఊదేస్తున్నాడు సంజీవరావ్.

ఐదు నిముషాల్లో అవతల ఇంటి పెంకులమీద ఉన్న గోనెసంచి కిందకి తెప్పించడం అందులో ముప్పైరెండు కేజీల బంగారు నగలూ, కాంట్రాబ్యాండ్

బంగారం 'బిస్కెట్లూ' బయటపడటం జరిగింది.

మేము సంచి స్వాధీనం చేసుకుంటుండగా ఇంటి యజమాని లబో దిబోమని గోలపెట్టేశాడు. మార్వాడీ కొడుకూ, తన కొడుకూ క్లాసుమేట్లనీ, గోనె విషయంలో తన కెట్టి సమాచారమూ తెలియదనీ.

సేట్ ఇంటిలో మేం స్టేట్ మెంటు రాయిస్తూ ఉండగా కమీషనర్ గారు వచ్చారు.

ఆశ్చర్యపోయాను

సంజీవరావ్ తరవాత చెప్పాడు. మఫ్టీలో ఉన్న మనుషుల్ని అవసరమైతే సహాయానికి రావడానికి బందోబస్తు చేశానని. ఈల వినగానే అంతా వచ్చారు.

"మరి కమిషనర్ గారు వెళ్ళిపోలేదేం?'

"యూ ఆర్ యంగ్ భాస్కర్. మాటుదగ్గర ఇది పాలిటెక్నిక్...మన మంతా ఏం కనుక్కోలేక వెళ్ళిపోయామని భ్రమకలిగించి వారిని పొంచి ఉండి చూస్తూండడం చాలా సింపుల్ గా ఉంది కదూ!"

వ్యాన్ లో మా ఊరు చేరాం.

"టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ కి పోనియ్!" కమీషనర్ గారు డ్రైవర్ కు చెప్పారు.

"ఆల్ ఆఫ్ యూ, ప్లీజ్ వెయిట్! కమాన్ భాస్కర్!"

ఆయనెవరో చెప్పకున్నావ్ ఆ కార్యాలయం అధికారి మాకు కావలసిన సమాచారం ఇచ్చాడు. తెల్లవారుఝామున నాలుగూ పదీ,నాలుగూ నలభై అయిదు నిముషాల మధ్య రెండు లైట్నింగ్ కాల్స్ విశాఖ, రెండు సాలూర్, ఒకటి శ్రీకాకుళం బుక్ చెయ్యబడ్డట్టు.

"కెన్ యూ గివ్ అజోది నంబర్స్?" ఉద్వేగంతో అడిగాను.

"నెవర్ మైండ్...థాంక్యూ" మెట్లవైపున నడిచారు కమీషనర్ గారు. ఆయన వెనక తలదించుకు నడిచాను.

నే చేస్తున్న ఉద్యోగం ప్రమాదకరమైందనే అనుకుంటూ వచ్చాను కాని, అడుగడుగునా తీసుకోవలసిన జాగ్రత్తలు, అసంఖ్యాకమైనవి ఆ క్షణంలోనే తెలుసుకున్నాను.